క్లుప్తంగా

వసతులు తప్పనిసరి

• ఆర్డీఓ హేమలత



మిర్తివలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత, అధికారులు

బలిజిపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద తప్పనిసరిగా వసతులు కల్పించాలని ఆర్డీఓ హేమలత అన్నారు. మండలంలోని బడేవలస, బర్లి, మిర్తివలస, పెదపెంకి, జనార్ధనపురం, తదితర పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. గదుల్లో ఫ్యాన్లు, ఫర్నీచర్, తదితర సదుపాయాలుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సామల సింహాచలం, డీటీ రత్నకుమారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్య, నైపుణ్యాలపై క్షేత్ర ప్రదర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

బలిజిపేట: వృత్తివిద్య, నైపుణ్యాలలో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న 120 మంది విద్యార్థులకు గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. చిలకలపల్లి సబ్‌స్టేషన్‌ను విద్యార్థులు సందర్శించగా.. సిబ్బంది విధులు, సబ్‌స్టేషన్ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృత్తివిద్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి



పూజలందుకుంటున్న లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలిసిన లక్ష్మీ నృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నృసింహస్వామికి అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించండి



అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

బలిజిపేట: ఆర్‌సీహెచ్‌లలో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు ఏఎన్‌ఎంలు కోరారు. ఈ మేరకు అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, 2007 నుంచి ఆర్‌సీహెచ్ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అయినప్పటికీ రావాల్సిన అలవెన్స్‌లు రావడం లేదని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కస్టమర్లకు చెల్లింపులు చేయాలి..



ఆందోళన చేస్తున్న సహారా ఏజెంట్లు, ఖాతాదారులు

పార్వతీపురం: సహారా ఇండియా కస్టమర్లకు డిపాజిట్ సొమ్మును వెంటనే చెల్లించాలని కోరుతూ ఫీల్డ్ సిబ్బంది, ఖాతాదారులు గురువారం స్థానిక సహారా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెబికి, సహారా మధ్య నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆందోళనలో యూనియన్ నాయకులు ఎ.శ్రీనుబాబు, రమణ, సర్వేశ్వరరావు, శేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి సంతకం

• ములగలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే అలజంగి



జేసీబీతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పల్లెలు ప్రగతిపథంలో నడుస్తున్నాయని, అందుకు నిదర్శనం గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ములగ పంచాయతీ పరిధిలో రూ. 65 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను అందించాలనే సదుద్దేశంతో గ్రామాల్లోనే సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను నిర్మించినట్లు చెప్పారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ భాగ్యశ్రీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ మడక కృష్ణవేణి, మడక విశ్వనాథం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ బి. గురురాజు, సీనియర్ నాయకులు, పంచాయతీరాజ్ డీఈ రత్నాకర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలంలోని ములగ పంచాయతీ పరిధి డి. ములగ గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామం ప్రారంభంలో గల కోనేరుగట్టు నుంచి 150 మీటర్ల సీసీ రోడ్డు, రక్షణ గోడను రూ. 87 లక్షల ఏపీ పంచాయతీరాజ్ నిధులతో చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యశ్రీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ మడక కృష్ణవేణి, విశ్వనాథం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, జనరల్ సెక్రెటరీ వి. గురురాజు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాల్సిందే..

• ఏఎంవీఐలు రమేష్‌కుమార్, సత్యనారాయణ



ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న ఏఎంవీఐలు

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఏఎంవీఐలు ఎస్.రమేష్‌కుమార్, జి. సత్యనారాయణ అన్నారు. జిల్లా రవాణాశాఖాధికారి సి. మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు రవాణా, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద రహదారి భద్రత నియమావళిపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వాహన చోదకలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని సూచించారు. కార్లు నడిపే వారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వి. సంతోషికుమారి, ట్రాఫిక్ ఏఎస్సై రాజారావు, సిబ్బంది కిశోర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

సాలూరు: మండలంలోని నెలిపర్తి అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు గురువారం సందర్శించారు. కేంద్రానికి వచ్చిన ఆయన అక్కడి అధికారులతో మాట్లాడారు. కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిబద్ధతతో పని చేయాలని కోరారు.

27 మందిపై బైండోవర్

సాలూరు: సారా వ్యాపారస్తులు 27 మందిపై తహసీల్దార్ ద్వారా పట్టణ సీఐ జిడి.బాబు బైండోవర్ చేయించారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయానికి పెద్దవీధి, రెల్లివీధులకు చెందిన సారా వ్యాపారస్తులను పిలిపించి వారికి నోటీసులు అందించారు. సారా వ్యాపారాలు చేయవద్దని,వాటి వలన కలిగే అనర్థాలను వివరించారు. ఇక నుంచి సారా అమ్మకూడదని వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్కడైనా సారా వ్యాపారం చేసినా చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్లు, పి.డి యాక్టులు ప్రయోగిస్తామని స్పష్టం చేశారు.

వీరఘట్టంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు రేపు

వీరఘట్టం: వీరఘట్టం వెలుగు కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఈ నెల 3న నిర్వహించనున్నట్లు ఏపీఎం బి.శివన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేపట్టనున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్ దృష్టికి పింఛన్ల సమస్య

జియ్యమ్మవలస: మండలంలోని పీటీ మండ పంచాయతీ పరిధి పల్లపుసిరిపి గ్రామానికి చెందిన 29 మంది వృద్ధులకు జనవరి నెల పింఛన్ అందలేదు. వలంటీర్ తప్పిదం లబ్ధిదారులకు శాపంగా మారింది. ప్రతినెలా పింఛన్ పంపిణీ తరువాత డేటాను సింక్ చేయాలి. అలా అయితే తరువాత నెల పింఛన్ లబ్ధిదారుల పేర్లు డిస్‌ప్లే అవుతాయి. వలంటీర్ మాత్రం జనవరి నెల పింఛన్ ఇవ్వకపోవడమే కాకుండా డేటాను సింక్ చేయలేదు. దీంతో ఫిబ్రవరి నెలలో కూడా పింఛన్ల జాబితాలో వారి పేర్లు కనిపించలేదు. పింఛన్ సమస్యను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా వలంటీర్ తప్పిదమే దీనికి కారణమని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రెండు, మూడు రోజుల్లో పింఛన్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట



సీతానగరం: అప్పయ్యపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ, తదితరులు

• ఎంపీపీ నాగమణి

బలిజిపేట: జగనన్న ప్రభుత్వంలో నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎంపీపీ నాగమణి తెలిపారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పెదపెంకిలో జరిగిన పింఛన్ల పంపిణీని ఎంపీపీ నాగమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, ఆర్థికంగా ఆదుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

తెల్లవారుజామునే..

సీతానగరం: పింఛన్‌దారులకు తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ మొదలైంది. స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వలంటీర్లు ఉదయం ఆరు గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు రూ. 3 వేల నగదు అందజేశారు. మండల కేంద్రంతో పాటు లచ్చయ్యపేట, అప్పయ్యపేట, వెంకటాపురం, గుమ్మిడివరం, చినభోగిలి, తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగింది.



బలిజిపేట: పెదపెంకిలో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ నాగమణి

పేదలకు దుస్తుల పంపిణీ

పాలకొండ రూరల్: దైవజనుడైన క్రీస్తు వాక్కు మేరకు ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమను కలిగి ఉండాలని పట్టణానికి చెందిన షారోణు ప్రార్థనా మందిరం నిర్వాహకులు ఎస్.యేసురత్న రాజ్‌కుమార్ అన్నారు. కొత్తవీధిలో ఉన్న శ్రీహల సంగీతరావు సత్యవేదం చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవంలో భాగంగా పేదలకు వస్త్రదానం చేపట్టారు. ట్రస్టు ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా నిర్వాహకులు మాట్లాడుతూ నిత్య అన్నదానం ప్రారంభించి ఎందరో పేదలకు ఆహారం అందించటం దేవుని కృపగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణానికి చెందిన వివిధ క్రైస్తవ సంఘాల నిర్వాహకులు హాజరయ్యారు.



దుస్తులు అందుకున్న వారితో నిర్వాహకులు

‘భోజనం’ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీతంపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీతంపేట ఎంఈఓ ఆనందరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వంట కార్మికులు వినతిపత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణారావు మాట్లాడుతూ నెలకు రూ.10 వేలు వేతనం 5వ తేదీలోపు చెల్లించాలన్నారు. మెనూ చార్జీలు రూ.20 చెల్లించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని కోరారు. వంట చేసినపుడు అగ్ని ప్రమాదానికి గురైతే నష్టపరిహారం చెల్లించాలన్నారు. పై సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీ ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉషా, రోయిబారి పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీతంపేట ఎంఈఓ ఆనందరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వంట కార్మికులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణారావు మాట్లాడుతూ భోజన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఉషా, రోయిబారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్న సంక్షేమ ఫలాలు

• ‘గడప గడపలో..’ ఎమ్మెల్యే కళావతి



కీసరలో సంక్షేమ పథకాల జాబితాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ఇంటింటా అందుతున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కీసరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. వ్యక్తిగత సమస్యలపై ఆరా తీశారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, చెంగల ఫల్గుణరావు, ఒమ్మి మోహనరావు, కొత్తకోట చంద్రశేఖర్, గెల్లంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ



ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను మర్యాద పూర్వకంగా కలిసిన రూరల్ సీఐ

సాలూరు: సాలూరు రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన జి.బాలకృష్ణ ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలో ఆయన స్వగృహంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిబద్ధతతో పని చేయాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. ఈయన గతంలో విజయనగరం జిల్లా పూసపాటిరేగ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై రూరల్ సీఐగా నియమితులయ్యారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ధనుంజయరావు అనకాపల్లికు బదిలీ అయ్యారు. ఇరువురు ఉపముఖ్యమంత్రిని కలిశారు.

మౌలిక సదుపాయాల పరిశీలన



గెద్దలుప్పిలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

సీతానగరం: మండలంలోని కొత్తవలస, బగ్గందొరవలస, బీకే పురం, పనుకుపేట, దయానిధిపురం, గాదెలవలస, జయంతిరాయపురం, రంగంపేట పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ కె. హేమలత గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బగ్గందొరవలస ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే రికార్డులు, హాజరు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంఈఓ-1 జి. సూరిదేముడు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



నియోజకవర్గ స్థాయి క్రీడాకారులతో రంగునాయుడు

మక్కువ: ఆడుదాం.. ఆంధ్ర క్రీడల్లో రాణించిన క్రీడాకారులను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు గురువారం అభినందించారు. ఆడుదాం.. ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడల పోటీల్లో బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించిన మక్కువ క్రీడాకారులను రంగునాయుడు స్థానిక పద్మశ్రీ థియేటర్ వద్ద అభినందించారు. ఈ సందర్భంగా రంగునాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మక్కువకు చెందిన క్రీడాకారులు ఖోఖో పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలలో నియోజవర్గ స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించడం ఆనందంగా ఉందన్నారు.

నియమాలు పాటించాల్సిందే : అధికారులు



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాలూరు: రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సీఐ జిడి.బాబు అన్నారు. పట్టణంలోని లారీ ఓనర్స్ యూనియన్ కార్యాలయంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన మెడికల్ క్యాంప్, అగ్ని ప్రమాదాల నివారణ అవగాహన సదస్సు, రహదారి భద్రత కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తూ వాహనాలు నడపడం వలన చాలా వరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. మితిమీరిన వేగాలతో ప్రయాణం చేయరాదని తదితర ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణ అగ్నిమాపక శాఖ అధికారి సుధాకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు.

దేవుడి మార్గం అనుసరణీయం



రామసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న వక్తలు

పాలకొండ రూరల్: భగవంతుడు జీవుల శ్రేయస్సుకై చూపిన మార్గం అనుసరణీయమని ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని పనుకువలస రామసాయి మందిరంలో గీతా పారాయణం, సత్సంఘ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు శ్రీకృష్ణుడు గీతలో సూచించిన 18 అధ్యాయాల విశిష్టత, అందులో దాగి ఉన్న జీవన సారాంశాన్ని వివరించారు. ఆధ్యాత్మిక బోధనకై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో సామంతుల దామోదరరావు, ఇప్పిలి తవిటిరాజు, ఎస్.చిన్నారావు, ఎం.మోహన్‌దాస్ తదితరులు గీతా పారాయణం చేశారు.

దేవనాపురం అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీడీపీఓ రంగలక్ష్మి

సీతంపేట: మండలంలోని దేవనాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ పి.రంగలక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సెంటర్ నుంచి సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతుందని, ఎలుకలు కొట్టేసినవి ఇస్తున్నారని బుధవారం సీతంపేటలో జరిగిన మండల సమావేశంలో వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి ఆరోపించారు. దీనికి స్పందించిన సీడీపీఓ కేంద్రానికి వెళ్లి విచారణ చేశారు. వైస్ ఎంపీపీ సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడారు. అందరికీ సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని ఎప్పటి స్టాక్ అప్పుడు లబ్ధిదారులకు అందజేయాలని సిబ్బందికి సూచించారు.